



ఘనంగా రంజాన్

జిల్లావ్యాప్తంగా ముస్లింలు సోమవారం ఘనంగా రంజాన్ పర్వదిన వేడుకలు జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఖురాన్ ప్రవచనాలు వినిపించారు. ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ప్రేమ, సోదర భావం, శాంతికి చిహ్నమే రంజాన్ పర్వదినమన్నారు. ప్రజలందరికీ మంచి జరగాలని, పేదవారికి సాయం చేయాలనే సిద్ధాంతాన్ని రంజాన్ బోధిస్తుందన్నారు. (చిత్రంలో) ఏలూరు కర్బలా మైదానంలో ప్రత్యేక నమాజ్‌లో పాల్గొన్న ముస్లింలు.



వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు తగదు

కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ సోమవారం ఏలూరు తంగెళ్ళమూడి వంతెన వద్ద ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి మౌన ప్రదర్శన చేపట్టారు. రంజాన్ నమాజ్ అనంతరం మసీదుల నుంచి ర్యాలీగా వంతెన వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. ముస్లిం పెద్దలు ఎం.డి.ఇస్మాయిల్ షరీఫ్, ఇలియాస్ మాట్లాడుతూ ముస్లిం వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు స్థానం కల్పించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. - ఏలూరు రూరల్

ఇన్‌చార్జుల ఏలుబడిలో..



- జిల్లాలో 716 దేవాలయాలు, సత్రాలు, మఠాలు
- పర్యవేక్షించేది 23 మంది ఈవోలే..
- చాలాచోట్ల గుమస్తాలే దిక్కు
- ఆక్రమణల చెరలో దేవుడి మాన్యాలు

(ఏలూరు- ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని దేవాలయాల అభివృద్ధి కుంటుపడుతోంది. పాలకులు, ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడంతో పాలనా వ్యవహారాలు స్తంభిస్తున్నాయి. కార్యనిర్వహణాధికారులు (ఈవోలు), సిబ్బంది కొరత కారణంగా దిశా నిర్దేశనం చేసేవారే లేకుండా పోయారు. కొన్నిచోట్ల ఆలయాల్లో కనీస సౌకర్యాలు లేని దుస్థితి. ఏళ్ల తరబడి ఇన్‌ఛార్జుల పాలనలోనే కొనసాగు తున్నాయి. సిబ్బంది కొరత కారణంగా ఒక్కో అధికారి 10 నుంచి 20 ఆలయాలు బాధ్యతలు చూస్తున్నారు. ప్రత్యేక పర్వదినాలు, ఉత్సవాల సమయంలో తప్ప మామూలు రోజుల్లో ఆలయాలకు వస్తున్న దాఖలాలు లేవు. జిల్లాలో 716 దేవాలయాల పరిధిలో 12,870 ఎకరాలు భూములున్నాయి. ఇందులో 5,400 ఎకరాలు మాగాణి ఉండగా, 6,291 ఎకరాల్లో మెట్ట భూములున్నాయి. 964 ఎకరాల్లో చేపల చెరువులున్నాయి. ఇక మిలిగినవన్నీ కొండ, డ్రై ల్యాండ్స్ కింద చెబుతున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనకు సిబ్బందే లేకపోవడంతో వీటి రక్షణ కంటే భక్షణే ఎక్కువగా జరుగుతోందన్న ఆరోపణలున్నాయి. వైసీపీ ప్రభుత్వం హయాంలో గ్రూప్-4 ద్వారా పోస్టుల భర్తీ చేయగా, ఆరుగురు వరకు ఈవోలు జిల్లాకు వచ్చారు. అయితే అనుకున్నంత రీతిలో దేవదాయశాఖలో ఉద్యోగాల భర్తీ లేక అనేక ఇబ్బందులు నెలకొన్నాయి. పర్యవేక్షణ లోపంతో ఆస్తులు అన్యాక్రాంతమవు తున్నాయి. ఆదాయానికి గండి పడుతోంది. ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగట్లేదు. ఉన్న సిబ్బంది పనిభారంతో సతమతం అవుతున్నారు.

- జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లలో ఈవోల కొరత తీవ్రంగా ఉంది. ఈవోలపై పనిభారం అధికంగానే ఉంటుంది. వేలం పాటలు, ఆదాయాలు వసూళ్లు, భూముల పరిశీలన తదితరాల్లో పెనుభారమే మోస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రేడ్ 1- ఈవోలు ఏడుచోట్ల, గ్రేడ్ -2 ఈవోలు 7 చోట్ల, గ్రేడ్ -3 ఈవోలు 9 చోట్ల మాత్రమే ఉన్నారు. మొత్తం 23 మందే ఉన్నారు. ఆదాయాల పునర్విభజన జరిగిన నేపథ్యంలో ఈవోల భర్తీపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. దేవాలయాలకు చెందిన భూములు కౌలు, వేలంపాట, దుకాణాల అద్దెల వసూలు సక్రమంగా జరగట్లేదు. హుండీల ఆదాయం, దేవతా మూర్తుల ఆభరణాల భద్రత కరవుతోంది. కొన్ని ఆలయాలకు కోట్ల విలువైన భూములున్నా.. అవన్నీ ఆక్రమణలకు గురికావడంతో దూపదీప నైవేద్యాలు, ఉత్సవాల నిర్వహణకు సొమ్ములేని పరిస్థితి. ఆక్రమణ భూములపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే దేవదాయశాఖకు ఆదాయంతోపాటు లబ్ధిదారులకు ప్రయోజనం కలుగుతుంది. ఈ సమస్యపై దశాబ్దాలుగా నిర్ణయం తీసుకోకపోవడంతో ఆలయాలకు ఆదాయం రాకపోగా ఉత్సవాలకు దాతలు, విరాళాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఈ అంశాలపై దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రంగారావును వివరణ కోరగా.. 'ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రూప్ టెంపుల్స్‌కు ఈవోలనే ఎక్కువగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తున్నాం. ట్రస్టీల పరిధిలోనే గుమస్తాలను ఆయా పాలక వర్గాలు ఏర్పాటు చేసుకుంటాయి. ఆదాయానికి గండికొట్టే వారిని ఉపేక్షించేది లేదు' అంటూ స్పష్టం చేశారు.

ఇక మాటలు కాదు.. చేతలే!





జిల్లాల్లో మార్పు కోరుకుంటున్న ప్రభుత్వం

'ప్రజలకు కావాల్సిన పనులు చేసి చూపించాలి. ప్రతి విషయంలోను మీకంటూ ఒక చొరవ ఉండాలి. ప్రజలతో మమేకమవ్వాలి. సమస్యకు పరిష్కారం దిశగా చర్యలు ఉండాలి. తగినట్టుగానే లక్ష్యాలు అందుకోవాలి. ప్రజల్లో నమ్మకం పెంచాలి. స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ దగ్గర నుంచి అన్ని విషయాల్లో మీ పాత్ర ఏ రకంగా ఉంటుందో గమనిస్తాం..' ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్య మంత్రి చంద్ర బాబు కలెక్టర్ల పాత్రపై తేల్చేశారు. పంటల దగ్గర నుంచి పాడి వరకు ఎక్కడెక్కడ వెనుకబడి ఉన్నా మో చెప్పి ఒక నిర్దేశం చేశారు. దీంతో ఇక కలెక్టర్ పనితీరు, జిల్లాల్లో జరుగుతున్న పాలనా వ్యవహారాలపై పూర్తిగా అటెన్షన్ వచ్చింది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఒకప్పుడు అధికారులు కంటే ముఖ్యమంత్రి చంద్రబాబు భిన్నంగా పనిచేసేవారు. ప్రతీ విషయంలోను తనకంటూ ఒక మార్క్ ఉండేలా జాగ్రత్తపడ్డారు. కలెక్టర్, ఎస్పీ దగ్గర నుంచి జిల్లా స్థాయి అధికారులంతా ఎలా నడవాలో దిశా నిర్దేశం చేసేవారు. ఇటీవల జరిగిన సమావేశంలో జిల్లా అధికారులు పక్కాగా తమ కంటూ ఒక పనిని నిర్ణయించుకుని ప్రజలు మెచ్చేలా పాలన చేసి తీరాల్సిందేనన్న సరికొత్త ఫోకస్ ఇచ్చారు. ప్రతీ అంశాన్ని ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించడం, పని ప్రాతిపదికనే రిమార్కులు ఉండడంతో ఇక పాలనా యంత్రాంగంలో చొరవ కనబడుతుందని భావిస్తున్నారు. వాస్తవానికి జిల్లా స్థాయిలో అధికారులతో సమీక్షలు జరుగుతున్న ఫలితాలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. కలెక్టరేట్ కేంద్రంగా వివిధ విభాగాధిపతులు తమ శాఖల్లో లక్ష్యాల సాధనకు అనుకూలంగా వ్యవహరించలేకపోతున్నారు. ప్రత్యేకించి వ్యవసాయం, విద్య, వైద్యంతోపాటు మునిసిపల్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్ వంటి కీలక శాఖలు అనుకున్నది అనుకున్నట్టుగా ముందుకు సాగలేకపోతున్నాయి. గత ఐదేళ్ల కాలంలో ఏదైతే వైఫల్యం జరిగిందో వాటిని సరిదిద్దడంలో ఇంకా వెనుకంజే. కొంతమంది అధికారులు కేవలం పాత వాసనతోనే వ్యవహరిస్తున్నారన్న అపవాదు లేకపోలేదు. సాధారణంగా ఒక కార్యక్రమానికి ప్రభుత్వం భారీ ఎత్తున ప్రాచుర్యం చేయాలని సంకల్పించినా ఉన్నత స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు కనీసం పట్టించుకున్న పాపానలేదు. ఉదాహరణకు పౌర సరఫరాల విభాగంలో ప్రతీ కార్డుదారుడు ఈకేవైసీ చేయించుకోవాలని, అదికూడా మార్చి నెలాఖరులోపే తుది గడువుగా ముందస్తు ప్రకటన చేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు లక్షా 65 వేల కార్డుదారులు ఇంకా ఈకేవైసీ చేసుకోలేదని ఓ అంచనా. అయితే మండల స్థాయిలో భారీ ఎత్తున ప్రచారం నిర్వహించాల్సింది పోయి అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించారు. పేదలకు రుణాలు ఇచ్చే ప్రక్రియలోను ఇదే తరహా వైఫల్యాలు కనిపిస్తున్నాయి. ఈక్రమంలోనే సీఎం చంద్రబాబు ఈ మధ్యన కలెక్టర్లకు ఇచ్చిన మార్గనిర్దేశం ఆషామాషీగా లేదు. ఇక ప్రతీనెలా జాబ్‌మేళా నిర్వహించడం, ఉద్యోగ అవకాశాలు పెంచడం వంటి చర్యలు తీసుకోవాలి. అంటే దీనికి తగ్గట్టుగానే యువతను అప్రమత్తం చేయాలి. తగినట్టుగా సమాచారాన్ని చేరేలా చేయాల్సి ఉంది. వచ్చే నెల రెండో

- ప్రతి విషయంలోను చొరవ చూపాల్సిందేనంటూ ఆదేశాలు
- ఇకముందు క్లిష్ట సమస్యలకు జిల్లా స్థాయిలోనే పరిష్కారం
- యంత్రాంగం తీరుపైనే ఇక ఫోకస్

వారంలోపే జిల్లా స్థాయిలో జాబ్‌మేళా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

ఇక్కడ వదిలేసి.. ఎటువైపో చూసి !

జిల్లా రైతులకు పామాయిల్ పంట ధర విషయంలో గత పదేళ్లుగా సమస్య వెంటాడుతూనే ఉంది. పామాయిల్ పంట నిర్దేశించిన కేంద్రానికి చేర్చడంలో అనేక ఒడిదుడుకులు ఎదురవుతున్నాయి. ధర విషయంలో సరిహద్దున ఉన్న తెలంగాణ ప్రాంతంలోని అశ్వారావుపేటలో ఒక తీరు, పెదవేగిలో ఇంకో తీరును రైతులు ఎదుర్కొంటూ అవస్థలు పడుతూ వచ్చారు. జిల్లా స్థాయిలో చొరవ తీసుకుని సమస్యను రూపు మాపాల్సి ఉన్నా అలా చేయలేకపోయారు. సాక్షాత్తు ముఖ్య మంత్రి జోక్యం చేసుకుని రైతు సమస్యలను సంబంధిత కంపెనీలతో మాట్లాడి సరిదిద్దాల్సిం దిగా ఆదేశించాల్సి వచ్చింది. అలాగే టూరిజంకు సంబంధించి గత ఐదేళ్లల్లో సర్వనాశనం కాగా, కొల్లేరు ప్రాంతంలో గుడివాకలంక సమీపాన ఉన్న చిన్నపాటి రిసార్టులు నాశనమయ్యాయి. కొంత చొరవ తీసుకుని ఈ తొమ్మిది నెలల పాలనలో ఆ తరహా రిసార్టులకు మోక్షం ఇచ్చి ఉంటే ఆదాయ మార్గాలకు దారి ఇచ్చినట్టయ్యేది. కాని.. ఈ తరహా చిన్న పనులను కూడా జిల్లా యంత్రాంగం పట్టించుకోలేదు. కొరుటూరు వద్ద గతంలో కట్టిన పర్యాటక భవనాలదీ ఇదే తీరు.

గత తొమ్మిది నెలల్లో అనుభవాల దృష్ట్యా ఈసారి వేసవిలోనే యంత్రాంగంలో మార్పు వచ్చిందా, లేదా అనేది తేలిపోనుంది. ఇప్పటికే అక్కడక్కడ తాగునీటి సమస్య, ఇంకొన్ని చోట్ల విద్యుత్ కోతలు అనివార్యంగా మారాయి. ఇంతకు ముందే సమీక్షించినట్టుగా యాక్షన్ ప్లాన్

ఈసారి మార్చాల్సిందే ..

అమలు చేస్తారా, లేదా చేతులెత్తేస్తారా.. అనేది తేలనుంది. ఎందుకంటే కాల్వలను కట్టేసే ముందే చెరువులకు తాగునీరు చేరాలి. ఇప్పటివరకు అలాంటి పరిస్థితులేవీ లేవు. మెట్ట ప్రాంతాల్లో ఈ తరహా సంకేతాలు ఇప్పటికే స్పష్టంగా ఉన్నాయి. పశుగ్రాసం కొరత పొంచి ఉంది. కొంతలో కొంత ఆర్‌అండ్‌బీ శాఖ తమకు ఇచ్చిన లక్ష్యాల మేరకు రోడ్ల మరమ్మతులు కొంత పూర్తి చేయగలిగారు. రాబోయే రెండు నెలల వ్యవధిలోనే మిగతా రోడ్ల పనులు, వంతెనల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకోకపోతే ఏటా మాదిరిగానే ఈ ఏడాది ప్రజలకు అవస్థలు తప్పవు.

జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో చోటు చేసుకుంటున్న పరిణామాలను అవగాహన చేసుకోవడం, ఎమ్మెల్యేలు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకోవాల్సిన ఆవశ్యకత స్పష్టంగా కనిపిస్తోంది. జిల్లా పరిషత్, డీసీసీబీ, డీసీఎంఎస్ వంటివన్నీ ఇంకా ఉమ్మడి జిల్లా పరిధిలోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటి పాత్ర కూడా అత్యంత కీలకం. రాబోయే సీజన్‌లో రైతులకు కావాల్సిన అవసరాలు ఏమిటి, మారుమూల గ్రామాల్లో గతేడాది అనుభవాలు తిరిగి పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలేమిటనేది సమీక్షించుకోవాలే తప్ప తూతూ మంత్రంగా సమావేశాలు పెట్టి చేతులు దులుపుకుంటే అన్నీ అష్టకష్టాలే. ప్రభుత్వం నిర్దేశించినట్టుగా శాఖల వారీగా పుంజుకోకపోతే మరిన్ని కష్టాలు తప్పవు. సాధ్యమైనంత మేర ఈ తరహా పరిస్థితిని అధిగమించే దిశగా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. తగిన కార్యాచరణను త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది.

నేటి నుంచే ఇంటర్ 'ద్వితీయ' తరగతులు

- తొలిరోజునే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీకి ఏర్పాట్లు
- మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం
- 24 నుంచి జూన్ 1వరకు వేసవి సెలవులు

ఏలూరు అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు రాసిన విద్యార్థులతో ద్వితీయ సంవత్సరం తరగతులన్ని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో 2025-26 కొత్త విద్యాసంవత్సరం మంగళవారం ప్రారంభమవుతోంది. తొలిరోజునే ప్రభుత్వ యాజమాన్యంలోని అన్ని కళాశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలను పంపిణీ చేయడానికి వీలుగా ఇంటర్ బోర్డు జిల్లా అధికారులు ఆయా కళాశాలలకు అందజేశారు. వీటిని 19 ప్రభుత్వ, 31 హైస్కూల్ ప్లస్, 3 కేజీబీవీ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు స్థానిక ప్రజా ప్రతినిధుల ద్వారా అందజేయాలని ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. ఇవిగాక మరో 6 సోషల్ వెల్ఫేర్, 3 ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలు ఉండగా, వీటిలో ద్వితీయ సంవత్సరం తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు పుస్తకాల పంపిణీపై మార్గదర్శకాలు రాలేదని అధికార వర్గాలు వివరించాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాలల నుంచి ఈ ఏడాది మొత్తం 18,853 మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరం పరీక్షలు రాయగా, వీరంతా ద్వితీయ సంవత్సరం తరగతులకు అర్హత సాధించనట్టుగా పరిగణిస్తారు. ద్వితీయ సంవత్సరం తరగతులు మంగళవారం నుంచి ఈ నెల 23 వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారు. నిర్దేశిత మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తారు. ప్రస్తుతం ఏలూరులో జరుగుతున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన విధుల్లోవున్న జూనియర్ లెక్చరర్లు మినహా, మిగతా అధ్యాపకులంతా కళాశాల విధులకు హాజరు కావాలని డీవీఈవో ప్రభాకరరావు ఆదేశాలు జారీ చేశారు. మూల్యాంకన ప్రక్రియ ఏప్రిల్ 3న ముగియనుంది. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాసిన బాల బాలికలు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు వీలుగా ఈనెల 7నుంచి అన్ని ప్రభుత్వ కళాశాలల్లో బ్రిడ్జి క్లాసులు ప్రారంభించడానికి జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది ప్రథమ సంవత్సరం పాఠ్యపుస్తకాల సిలబస్ మారిపోనున్నందున కొత్తసిలబస్‌తో కూడిన పాఠ్యపుస్తకాలు కొద్దిరోజుల్లో జిల్లాకు రానున్నాయి. ఈ నెల 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులందరికీ వేసవి సెలవులు ఉంటాయి. జూన్ 2న పునఃప్రారంభమవుతాయి. ఏప్రిల్ రెండో వారంలో ఇంటర్ పరీక్షల ఫలితాలు వెలువడినవెంటనే అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ప్రక్రియ ప్రారంభం కానుండడం, రెగ్యులర్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహించాల్సి ఉండడంతో ఈ దఫా జూనియర్ లెక్చరర్లకు వేసవి సెలవులు పూర్తిస్థాయిలో వినియోగించుకునే అవకాశం ఉండబోదని అధ్యాపక వర్గాలు చెబుతున్నాయి.

మామిడి ధరలు పతనం

- బంగినపల్లి రకం టన్ను రూ.1.10 లక్షల నుంచి రూ.70 వేలకు పతనం
- డీలా పడుతున్న రైతులు

చాట్రాయి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మామిడి కాయల ధరలు రోజురోజుకు దిగజారుతుండడంతో రైతులు డీలా పడుతున్నారు. సీజన్ ప్రారంభంలో బంగినపల్లి రకం టన్ను రూ.1.10 లక్షలు ఉండగా ఇప్పుడు రూ.70 వేలకు పడిపోయింది. కలెక్టర్ రకం రూ.90 వేల నుంచి రూ.30 వేలకు దిగజారింది. ఏటా మాదిరిగానే ఢిల్లీ వ్యాపారులు సిండికేట్‌గా ధరలు తగ్గిస్తున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలో ఏడు వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంట మామిడే. ఈ ఏడాది మామిడి పూత ఆశాజనకంగా రావడంతో కాపు బాగా ఉంటుందని అధిక దిగుబడులు వస్తాయని రైతులు ఆశించారు. కాని మంచు ప్రభావంతో తేనె మంచు పురుగు ఉధృతి పెరిగి దిగుబడులు నామమాత్రంగానే వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. 20 ఏళ్ల క్రితం మండలంలో 25 వేల ఎకరాలు మామిడి తోటలు ఉండేవి. విజయవాడ తర్వాత భారీ స్థాయిలో మామిడి కాయలు దేశంలోని అన్ని నగరాలకు ఎగుమతి అయ్యేవి. అప్పట్లో రైతులకు కాసుల పంట పండింది. అధిక దిగుబడులు ఆశించి రైతులు రసాయనిక ఎరువులు పురుగు మందులు యథేచ్ఛగా వాడడంతో మంగు తెగులు వచ్చి నాణ్యత దెబ్బతింది. దీంతో మామిడి సాగుకు దుర్దశ వచ్చింది. వరుస నష్టాలు వస్తుండడంతో చాలా మంది రైతులు మామిడి తోటలు నరికి పామాయిల్, మొక్కజొన్న సాగు చేస్తున్నారు. తేనె మంచు పురుగు, తామర పురుగు మొదలైన తెగుళ్ల వల్ల దిగుబడులు తగ్గి వరుస నష్టాలు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మామిడి కాయలు ప్యాకింగ్ చేస్తున్న కూలీలు

నేడు, రేపు వడగాడ్పుల తీవ్రత

ఏలూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : వడగాడ్పుల తీవ్రత ఈనెల 1,2 వ తేదీల్లో కొనసాగే అవకాశాలున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలను జారీ చేసింది. జిల్లాలో మంగళవారం కుక్కునూరులో 40.2 పోలవరంలో 38.7, జంగారెడ్డిగూడెంలో 38 డిగ్రీల ఉష్ణోగ్రతలతో పాటు పలు చోట్ల వేడిగాలుల తీవ్రత ఉండనుంది. ఈ నేపథ్యంలో ప్రజలు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరింది.

■ లోపలి పేజీల్లో..

రహదారులకు మహర్దశ
- సీ-కేటగిరీ కింద మరమ్మతులు, అభివృద్ధికి రూ.42.22 కోట్లు
- ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 24 రోడ్లకు మోక్షం

అంకన్నగూడెంలో యువకుడి ఆత్మహత్య
- మహిళతో వివాహేతర సంబంధం
- యువకుడి మృతి విషయం తెలిసి పురుగుల మందు తాగిన మహిళ

శ్రీవారి ఆలయంలో బాంబ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు

ఆ పిల్లలు .. ఎక్కడున్నారు?



డ్రాప్‌బాక్సులో 20వేల మందికి పైగా బాలలపై ఆరా
మళ్లీ బడిలో చేర్చేందుకు ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

ఏలూరు అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : బడికిరాని పిల్లలంతా బాల కార్మికులే.. విద్యాహక్కు చట్టంలో ఇదో ప్రధానాంశం. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుత విద్యాసంవత్సరంలో నమోదైన బాలబాలికల్లో బడికిరాని పిల్లలు 20,486 మందిగా ఆయా మండలాల్లో పాఠశాలల వారీగా డ్రాప్‌బాక్సుల్లో అధికారికంగా నమోదైన బాలలు వీరంతా. పాఠశాలలో ఒకసారి అడ్మిషన్ తీసుకుని కొన్నిరోజులపాటు తరగతులకు హాజరైన అనంతరం ఇక కంటిన్యూగా బడికి హాజరుకాని విద్యార్థులను ఇలా ఆన్‌లైన్ డ్రాప్‌బాక్సుల్లో హెచ్‌ఎంలు చేరుస్తారు. వీరిలో కొందరు ఇతర పాఠశాలల్లో అడ్మిషన్ తీసుకోవాలన్నా, అంతకు ముందు చదివిన పాఠశాల హెచ్‌ఎం డ్రాప్‌బాక్సు నుంచి పేరును తొలగిస్తేనే కొత్తస్కూలులో అడ్మిషన్‌కు అవకాశం ఉంటుంది. కానీ జిల్లాలో ఇప్పటికీ 20 వేల మందికి పైగా బాల బాలికలు డ్రాప్‌బాక్సుల్లోనే కొనసాగుతుండడానికి కారణాలను తెలుసుకోవడంతోపాటు, వారందరినీ ప్రత్యక్షంగా కలుసుకుని మళ్లీ బడికి రప్పించ డానికి ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు తాజాగా ఆదేశాలు జారీ చేశారు. కాగా ఈ ఆదేశాలకు ముందుగానే రాష్ట్ర అధికారులు పంపిన డ్రాప్‌బాక్సు విద్యార్థుల వివరాల ప్రకారం మండల విద్యాధికారులు క్షేత్రస్థాయి నుంచి తెప్పించుకున్న సమాచారం ప్రకారం సంబంధిత విద్యార్థులు బడిమానేయడానికి ఉన్నతాధికారులు పంపిన ఫార్మేట్‌లోని పది కారణాల నుంచి ఏదో ఒకదానిని నమోదు చేశారు. ఈ వివరాలతో సంతృప్తి చెందని ఉన్నతాధికారులు సంబంధిత డ్రాప్‌బాక్సు విద్యార్థుల ఇళ్లకే వెళ్లి వారి తల్లిదండ్రులకు నచ్చజెప్పి మళ్లీ బడిలో చేర్పించమే కాకుండా ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

నెలాఖరులోగా ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ పూర్తి

ప్రస్తుతం జరుగుతున్న పాఠశాలల పునర్వ్యవస్థీకరణ మేరకు ఐదు రకాల బడుల్లో సంబంధిత తరగతుల విద్యార్థులను ముందుగా మ్యాపింగ్, షిఫ్టింగ్ పూర్తిచేసిన అనంతరం డ్రాప్‌బాక్సుల్లో వున్న బాలబాలికలను గుర్తించి వారిని బడిలో చేర్పించడానికి ఏప్రిల్ రెండోవారంలో ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను జిల్లావ్యాప్తంగా నిర్వహించడానికి నిర్ణయించారు. స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహణలో పాఠశాలల హెచ్‌ఎంలు, టీచర్లు, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది, సీఆర్పీలు బృందాలుగా ఏర్పడి విద్యార్థుల ఇళ్లకువెళ్లి మళ్లీ బడిలో చేర్చేందుకు ప్రయత్నిస్తారు. బడి ఈడుగల పిల్లలందరూ బడిలో ఉండేలా చేయడమే దీని ముఖ్యోద్దేశ్యమని సమగ్రశిక్ష జిల్లా అధికారులు వివరించారు.



శ్రీవారి ఆలయంలో బాంబ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు

ద్వారకాతిరుమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చిన్నతిరుమలేశుని ఆలయాన్ని బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ప్రముఖ క్షేత్రాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు జరిపినట్లు బృంద సభ్యులు జి.సురేష్, టి.రాటాలు, డాగ్ హాండ్లర్ రాజు తెలిపారు. ఆలయ పరిసరాలు, గోపురాలు, అనివేటి మండప ప్రాంతం, ప్రసాదాల కౌంటర్లు, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ఇతర ప్రదేశాలో బుల్లెట్ పేరుతో పిలిచే డాగ్‌తో ఈ తనిఖీలు చేపట్టారు.



ద్వారకాతిరుమల శివారు లక్ష్మీపురంలోని పురాతన ఆలయంలో స్వామి, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లను తాకిన సూర్యకిరణాలు

శ్రీనివాసుని తాకిన రవి కిరణాలు

ద్వారకాతిరుమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సాయం సంధ్యవేళ భానుడి కిరణాలు గర్భాలయంలో కొలువైన శ్రీనివాసుని అపాదమస్తకం స్పృశించే శుభసమయంలో వీక్షించిన భక్తులు ఆనంద పారవశ్యంలో మునిగారు. ఏటా చైత్ర మాసం ప్రారంభ రోజుల్లో సాక్షాత్కరించే ఈ అరుదైన ఘట్టం పురాతన దేవాలయమై, శ్రీవారి క్షేత్ర దత్తత దేవాలయమైన లక్ష్మీపురం జగన్నాథ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం ఆవిష్కృతమైంది. సూర్య కిరణాలు నేరుగా స్వామివారిని పూర్తిగా స్పృశించి అనంతరం పాదాల వద్దనున్న ఉత్సవ మూర్తులను తాకి తర్వాత చాలా సేపటికి రెండుగా చీలి పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లను తాకడం ఇక్కడి విశిష్టతగా చెప్పొచ్చు. ఆలయం ముందు చెట్లు, ధ్వజస్తంభం, పందిళ్లు ఉన్నా వాటిని తప్పించుకుని కిరణాలు లోనికి ప్రవేశిం చడం పలువురిని ఆశ్చర్య చకితుల్ని చేసింది.

ఆకట్టుకున్న ఉగాది నాటక పోటీలు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం బీవీఆర్ కళా కేంద్రంలో 32వ ఉగాది నాటక పోటీలు ఆకట్టుకున్నాయి. తొలిరోజు ఆదివారం రాత్రి రెండు నాటికలు ప్రదర్శించారు. ఏలూరు హేళాపురం కల్చరల్ అసోసియేషన్ భారతీయ వైవాహిక వ్యవస్థ గొప్పతనం చాటే విధంగా 'సారీ రాంగ్ నెంబర్' నాటిక అబ్బుర పరిచింది. హైద్రాబాద్ విశ్వ శాంతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'స్వేచ్ఛ' నాటిక అందరినీ ఆలోచింప చేసింది.. ముందుగా స్టాంప్స్ రిజిస్ట్రేషన్ డీఐజీ డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు, ప్రముఖ న్యాయవాది పడాల రవిలను బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపకుడు బుద్దాల రామారావు సత్కరించి ఉగాది విశిష్ట సేవా పురస్కారాలు అందించారు.



సారీ రాంగ్ నంబర్ నాటికలో ఓ సన్నివేశం

డాక్టర్ జగదీష్‌కు విశ్వ వైద్య దివ్యాంగ బంధు అవార్డు

ద్వారకాతిరుమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రి మాజీ డైరెక్టర్, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్, డాక్టర్ గుడారు జగదీష్ విశ్వవైద్య దివ్యాంగ బంధు అవార్డు అందుకున్నారు. మారిషస్ తెలుగు మహాసభ ఆధ్వర్యంలో ఫీనిక్స్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ జగదీష్ మారిషస్ ప్రధాన మంత్రి డాక్టర్ నవీన్‌చంద్ర రామ్ గులామ్ నుంచి ఈ అవార్డు పొందారు. నాలుగు దశాబ్దాలుగా దివ్యాంగుల శ్రేయస్సుకు తపిస్తున్న ఆయన దేశ, విదేశాలలో ఎన్నో ఉచిత క్యాంపులు నిర్వహించి ఎంతో కీర్తి సాధించారని పలువురు కొనియాడారు.



మారిషస్ ప్రధానమంత్రి నవీన్ చంద్ర నుంచి అవార్డు అందుకుంటున్న ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రి మాజీ డైరెక్టర్ డాక్టర్ జగదీష్

భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

ఏలూరు క్రైం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం సీతారామచంద్రుల కల్యాణ మహోత్సవం సందర్భంగా ఏప్రిల్ 5వ తేదీన ఏలూరు నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రజా రవాణా శాఖాధికారి వరప్రసాద్ తెలిపారు. ఈనెల 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు, సాయంత్రం 7 గంటలకు ఈ బస్సు సర్వీసులు ఉంటాయని భక్తుల సౌకర్యార్థం రిజర్వేషన్లు ప్రారంభించామని, టిక్కెట్లను ఆన్‌లైన్ ద్వారా కూడా పొందవచ్చునన్నారు. ఒకే ఊరి నుంచి 40 లేదా 50 మంది భక్తులు భద్రాద్రికి వెళ్లాలనుకుంటే వారి సౌకర్యార్థం వారి ఊరు నుంచి రానుపోను ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తామని తెలిపారు. భక్తుల రద్దీని బట్టి ఎన్ని బస్సులు అయినా ఏర్పాటు చేయ నున్నట్లు తెలిపారు.

జగన్నాథస్వామి ఆలయంలో ఒరిగిన బలరాముడి విగ్రహం

600 ఏళ్ల క్రితం మొగల్తూరు రాజ వంశీకుల ఏర్పాటు

రెండేళ్లుగా విగ్రహం శిథిలావస్థకు.. ఇటీవల ఉన్నతాధికారుల పరిశీలన

నరసాపురం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నరసాపురం పట్టణంలో ప్రసిద్ధిగాంచిన జగన్నాథస్వామి ఆలయంలో సోమవారం బలరాముడి మూల విరాట్ చెక్క విగ్రహం శిథిలావస్థకు చేరి కొద్దిగా పక్కకు ఒరిగింది. మిగిలిన సుభద్ర, జగన్నాథుడి విగ్రహాలు చెక్కు చెదర లేదు. 600 ఏళ్ల క్రితం మొగల్తూరు రాజవంశీకులు ఈ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఏడాది క్రితం బలరాముడి విగ్రహం కింద భాగంలో డొల్ల ఏర్పడింది. విషయాన్ని ఆలయ సిబ్బంది ఉన్నతాధికారులకు నివేదించారు. ఇటీవల డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారి ఈ విగ్రహాలను తనిఖీ చేసి ప్రభుత్వానికి నివేదించారు. సోమవారం బలరాముడి విగ్రహం కొద్దిగా ఒరగడాన్ని భక్తులు గుర్తించారు. విషయాన్ని వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆలయ ఈవో లోకేశ్వరావు మాట్లాడుతూ ఈ విగ్రహాలు ఏర్పాటు చేసి 600 ఏళ్లపైనే అయిందని, చెక్కతో తయారు చేసినవి కావడంతో ఇటీవల బలరాముడి మూల విరాట్ విగ్రహం అడుగు భాగంలో కొద్దిగా డొల్ల ఏర్పడింది. విషయాన్ని అధికారులకు నివేదించాం. ఉన్నతాధికారులు కూడా ఇటీవల విగ్రహాలను పరిశీలించారు. కాగా జిల్లాలో ఏకైక జగన్నాథస్వామి ఆలయం ఇదే కావడం గమనార్హం.



ఆలయంలోని జగన్నాథ, సుభద్ర, బలరాముడు మూల విరాట్‌లు

రహదారులకు మహర్దశ

(ఏలూరు,/భీమవరం-ఆంధ్రజ్యోతి): మార్చి 31: వైసీపీ జమానాలో నానాటికీ తీసికట్టుగా మారిన రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని రహదారులకు ఇప్పుడు మహర్దశ పట్టనుంది. తొలి విడతగా గుంతల్లేని రహదారులుగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పలు పనులను రాష్ట్ర సర్కార్ పూర్తిచేసింది. సంక్రాంతి నాటికే దాదాపుగా ఇవి పూర్తి చేశారు. గతంలో దారుణాతిదారుణంగా గుంతలు తేలిన రోడ్లను పూడ్చటానికి వీల్లేని వాటిని సీ-కేటగిరి కింద తీసుకుని ఆయా రీచ్‌ల వద్ద పూర్తి మరమ్మతులు, అభివృద్ధి చేయడానికి గత నవంబర్‌లో రెండు జిల్లాల అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి పంపారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా 24 రోడ్లకు రూ.42 కోట్ల 22 లక్షలతో పరిపాలనా ఆమోదం ఇచ్చింది.. ఇప్పుడు ఆ రోడ్లను పూర్తి చేయడానికి వేగంగా అడుగులు వేయనున్నారు.

ఏయే రోడ్లు బాగు చేస్తారంటే..

పలు నియోజకవర్గాల్లో రోడ్లపైన రాకపోకలు సాగించే ప్రజలు, ద్విచక్ర వాహనదారులు ప్రత్యక్ష నరకం చవి చూశారు. వారి బాధలకు మోక్షం కల్పిస్తూ ఈ రోడ్లును పూర్తిగా అభివృద్ధి చేస్తారు. ఇందులో దెందులూరు నియోజకవర్గంలోని ఏలూరు రూరల్ మండలం కొల్లేరు పరిధిలో కోటేశ్వరదుర్గాపురం నుంచి పైడి చింతపాడు వయా కొక్కిరాయలంక వరకు

సి-కేటగిరీ కింద మరమ్మతులు, అభివృద్ధికి రూ.42.22 కోట్లు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 24 రోడ్లకు మోక్షం

దాదాపుగా 6.9 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధికి రూ.2 కోట్ల 5 లక్షలతో గ్రావెల్ రోడ్డుస్థానంలో బీటీ వేయనున్నారు. ఇది వరదలు, వర్షాలతో పూర్తి సర్వనాశనం అయ్యింది. ఇదే రోడ్డు నుంచి డీపీ రోడ్డు వయా ముందూరు నుంచి మేదినరావుపాలెం 3.80 కిలోమీటర్ల నిడివి కలిగిన రోడ్డుకు రూ.కోటి 50 లక్షలు కైకలూరు నియోజకవర్గంలో ఉప్పరగూడెం నుంచి విశ్వనాద్రిపాలెం వరకు 2.55 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి రూ. కోటి 20 లక్షలు, స్పెషల్ రిపేర్లు కింద వెస్ట్ విప్పర్రు నుంచి గుణపర్రు వరకు 4.94 కి.మీ రూ.కోటి 50 లక్షలు, పశ్చిమ గోదావరి జిల్లాలోని ఉండి నియోజకవర్గంలో వాండ్రం నుంచి సీసలి 2 కిలోమీటర్ల రోడ్డుకు 2 కోట్ల 65 లక్షలు, తణుకు నియోజకవర్గంలోని ఉరదాళ్లపాలెం నుంచి దువ్వ వరకు 8.80 కిలోమీటర్ల రోడ్డుకు 3 కోట్ల 50 లక్షలు మంజూరు చేశారు.

రాష్ట్ర హైవే రోడ్ల అనుసంధానం

ఉమ్మడి జిల్లాల్లో 11 ప్రధాన రహదారులుండేవి. ఒక మండల నుంచి మరో మండలం అనుసంధానంతో పాటు రాష్ట్ర హైవేకు కలిపే రోడ్లు కూడా జిల్లాలో దారుణంగా తయారయ్యాయి. పూర్తిగా దెబ్బతిన్న రోడ్లపై లేయర్లను వేసి ఇతర రోడ్లకు సమాంతరంగా వీటిని తీర్చిదిద్దనున్నారు.



రెండు జిల్లాల పరిధిలో చింతలపూడి నియోజకవర్గంలో నర్సాపురం నుంచి అశ్వారావుపేట 0.99 కిలోమీటర్లకు రూ.80 లక్షలు, చేబ్రోలు- దేవులపల్లి రోడ్డు 2.17 కిమీకు 70 లక్షలు, చింతలపూడి- రావికంపాడు 4 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2 కోట్లు, పోలవరం నియోజకవర్గంలో యర్నగూడెం నుంచి పొంగుటూరు వరకు 1.20 కి.మీకు రూ.40 లక్షలు, పోలవరం నుంచి కొయ్యలగూడెం 7.60 కిమీకి రూ.3 కోట్ల 40 లక్షలు, చింతలపూడి - రావికంపాడు రోడ్డు 10 కిలోమీటర్లకు 4 కోట్ల 22 లక్షలు, ఏలూరు నియోజకవర్గంలో ఏలూరు నుంచి కైకలూరు వెళ్లే రోడ్డు 2 కిలోమీటర్లకు కోటి రూపాయలు, ఏలూరు నగరంలోని సీసీ రోడ్డు నూజివీడు- నుంచి ఏలూరు రోడ్డు 45 మీటర్లకు 90 లక్షలు, కైకలూరులో వడాలి నుంచి తాడినాడ రోడ్డు 5 కి.మీకు రూ.2 కోట్లు, దెందులూరు నియోజకవర్గంలో నూజివీడు- ఏలూరు రోడ్డు 1.20 కిలోమీటరు నిడివి గల రోడ్డురూ.60 లక్షలు, నూజివీడు నియోజకవర్గంలోని నూజివీడు- గన్నవరం రోడ్డు ఇంప్రూవ్‌మెంట్‌కు 5.40 కిలోమీటర్లకు 2 కోట్ల 50 లక్షలు, అడవి నెక్కలం నుంచి వెలవాదం రోడ్డు 9 కిలోమీటర్లకు 3 కోట్లు, ఉంగుటూరులో భీమడోలు- కామవరపుకోట పాతరోడ్డు ఇంప్రూవ్‌మెంట్ 1.8 కి.మీకు 2 కోట్లు మంజూరు చేశారు.

పశ్చిమగోదావరి జిల్లాలోని జిల్లాలో భీమవరం, ఉండి, పాలకొల్లు, ఆచంట, తణుకు నియోజకవర్గాల పరిధిలో రహదారులకు రూ.6.15 కోట్లు కేటాయించారు. తణుకులో మార్టేరు- ప్రత్తిలంక 5.90 కి.మీకు 3 కోట్లు, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో నరసాపురం- అశ్వారావుపేట 2.50 కోట్లు, పాలకొల్లులో పాలకొల్లు -దొడ్డిపట్ల రోడ్డు 11.60 కి.మీ మేర రూ.5 కోట్లు, ఆచంట నియోజక వర్గంలో పాలకొల్లు- ఆచంట రోడ్డు 1.50 కి.మీలకు కోటీ 50 లక్షలు, పెనుమంట్ర- వీరవాసరం1.50 కోట్లు పనులు చేసేందుకు పరిపాలనామోదం ఇచ్చారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఉక్కు మంత్రిత్వ శాఖ ప్రతినిధి బృందం

స్టీల్‌ప్లాంట్ బలోపేతానికి కృషి చెయ్యండి

భీమవరం టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు పూర్వవైభవం, బలోపేతానికి కృషి చెయ్యాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. భారత ప్రభుత్వ ఉక్కు మంత్రిత్వశాఖ ప్రతినిధి బృందం, కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో చర్చలు జరిపారు. వర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం (ఎస్పీఎఫ్)తో ప్లాంట్‌కు భద్రత కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న 2వ బ్లాస్ట్ ఫర్నేస్‌లతో పాటు, 3 వ ఫర్నేస్‌ను కూడా తిరిగి ప్రారంభించడం వంటి అంశాలను ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి చర్చించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌తో తమ రాష్ట్రానికి భావోద్వేగ అనుబంధం ఉందని, దీనిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ పూర్వ వైభవానికి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ సమన్వయంతో కలిసి పనిచేయాలని చెప్పారు. ఇందుకు అవసరమైన సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తూనే ఉంటుందని హామీ ఇచ్చారు. ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్, జాయింట్ సెక్రటరీ అభిజిత్ నరేంద్ర, ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ, ఆర్ఐఎన్ఎల్ ఇన్‌చార్జి ఎండీ అజిత్ కుమార్ సక్సేనా, మెకాన్ సీఎండీ ఎస్కే వర్మ, ఎంఎస్‌టీసీ లిమిటెడ్ సీఎండీ మనోబేంద్ర ఘోషల్ పాల్గొన్నారు.



హైదరాబాద్ రవీంద్రభారతిలో కిన్నెరసాని ఆర్ట్ థియేటర్స్ వారు నిర్వహించిన విశ్వావసు నామ ఉగాది కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నుంచి గౌరవ పురస్కారం అందుకుంటున్న ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ తేతలి దశరథరామారెడ్డి



మేడపాడులో గ్రావెల్‌రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్

కాలువల వెంబడి రహదారుల అభివృద్ధి : మంత్రి నిమ్మల

యలమంచిలి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రైతులు తాము పండించిన ధాన్యాన్ని తరలించు కోవడానికి ఉపయోగపడే 100 గ్రావెల్ రోడ్లను నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. మండలంలోని అడవిపాలెం, మేడపాడు గ్రామాల్లో రూ.1.15 కోట్ల నిధులతో చేపట్టనున్న రైతులకు ఉపయోగపడే నాలుగు గ్రావెల్ రోడ్ల నిర్మాణపనులకు మంత్రి రామానాయుడు సోమవారం శంకుస్థాపనలు చేసి, శిలా ఫలకాలను ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలతో పాటూ రైతులను, వ్యవసాయాన్ని గాలికొదిలేశారని, ఎన్డీఏ ప్రభుత్వంలో రైతులకు పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సారధ్యంలో సాగునీటి వ్యవస్థను గాడిలో పెడుతున్నామన్నారు. వచ్చే ఖరీఫ్‌కు ముందే అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకూ రూ.20 వేలు అందజేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మామిడి శెట్టి పెద్దిరాజు, బోనం నాని, చిలుకూరి బాలాజీ, చల్లా నరేంద్ర కుమార్, నడింపల్లి నరేష్‌కుమార్‌రాజు, బొప్పన హరికిషోర్, ఆరుమిల్లి చిన్ని పాల్గొన్నారు.



భరతనాట్యంలో చిన్నారులకు అవార్డులు

పోడూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సోమవారం నిర్వహించిన ఉగాది బాల- 2025 భారతీయ నృత్యోత్సవంలో పాల్గొన్న పోడూరు మండలం కవిటం గ్రామానికి చెందిన చిన్నారులు రేమెళ్ల మనోజ్ఞ, ఇళ్ల జాహ్నవి, సత్తి హరినాగశ్రీ, వీరవల్లి యశస్విని భరతనాట్య అరంగేట్రం చేసి తొలి ప్రదర్శనలోనే ఆహుతులను మెప్పించారు. వీరికి నర్తన వసంత కుసుమం అవార్డులను బహూకరించారు. ఎమ్మెల్యే పితాని సత్య నారాయణ చిన్నారులను అభినందించారు.

బాలికపై అత్యాచారయత్నం.. పోక్సో కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారయత్నం చేసిన ఘటనపై ఓ వ్యక్తిపై తాడేపల్లిగూడెం పట్టణ పోలీసు స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని కడకట్లకు చెందిన నాగరాజు ఇటుకల బట్టిలో పనిచేస్తుంటాడు. అతనికి వివాహమై పిల్లలు కూడా ఉన్నారు. రెండురోజుల క్రితం అదే ప్రాంతానికి చెందిన ఓ బాలికకు మాయ మాటలు చెప్పి వారి ఇంటి సమీపంలో అత్యాచారయత్నానికి పాల్పడగా మేనమామ చూసి కేకలు వేయగా నాగరాజు పరారయ్యాడు. బాలికతో పాటు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నాగరాజుపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

మహిళా ఖైదీ మృతదేహం అప్పగింత

ఏలూరు క్రైం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా జైలులో బ్యారక్‌లోని కిటికీకి చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన రిమాండ్ ఖైదీ గంధం శాంతకుమారి మృతదేహానికి సోమవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని ఆమె తల్లి కుమారికి అప్పగిం చారు. జీలుగుమిల్లి మండలం తాటియాకులగూడెం గ్రామానికి చెందిన గంధం శాంతకుమారి (31) ఆమె భర్త బోసును ఆమె ప్రియుడు గోపాలరావుతో కలిసి హత మార్చిందనే ఆరోపణపై అరెస్టు అయి మార్చి 24న ఏలూరు జిల్లా జైలుకు రిమాండ్ ఖైదీగా వచ్చింది. ఆమె కుటుంబ సభ్యులు ఈనెల 29వ తేదీన కలిశారు. ఆమె ఏమను కుందో ఏమిటో కాని ఈనెల 30వ తేదీ ఉదయం 7.30 గంటల సమయంలో బ్యారక్‌లోని రిమాండ్ ఖైదీలందరు టిఫిన్ చేయడానికి రాగా ఆమె కూడా బయటకు వచ్చి వాష్‌రూము అని చెప్పి లోపలకు వెళ్లి బ్యారక్ కిటికీకి తన చున్నీతో ఉరి వేసుకుంది. గమనించిన జైలు సిబ్బంది ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసురాగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సంఘటనపై జైలు సూపరింటెండెంట్ స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ విచారణ చేపట్టారు. మృత దేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించి తాటియాకులగూడేనికి మృత దేహాన్ని తీసుకువెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

భీమవరం క్రైం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : భీమవరం పట్టణంలోని విస్సాకోడేరు వంతెన సమీపంలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద సోమవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని వీధి

క్రైమ్ కార్నర్

సోమాలమ్మ (80) మృతి చెందింది. పట్టణంలోని 38వ వార్డు లంకపేటకు చెందిన సోమాలమ్మ శనివారం ఇంటి నుంచి బయటకు వచ్చి రోడ్ల వెంబడి తిరుగుతుండగా సోమవారం రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందింది. వీఆర్వో టి.వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఏఎస్ఐ కె.శ్రీనివాస్ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

భీమవరం క్రైం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఒక యువకుడిని మరో ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. తాడేపల్లిగూడేనికి చెందిన పసుపులేటి భార్గవ కళ్యాణ తేజ్ అనే యువకుడు ఈ నెల 30వ తేదీ రాత్రి 10.30 గంటలకు తాడేపల్లిగూడెంలో బయలుదేరి భీమవరం వారి బంధువుల ఇంటికి వస్తున్నాడు. రాత్రి 12 గంటల సమయంలో రాయలం ఆర్చి వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఆ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ వెంకట్రావు తెలిపారు.

ఓయో ప్రతినిధులపై చీటింగ్ కేసు నమోదు

ఏలూరు క్రైం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఒప్పందం ప్రకారం సొమ్ములను చెల్లించక పోవడంతో ఓయో ప్రతినిధులపై ఏలూరు త్రిటౌన్ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు చేశారు. ఏలూరు ఫైర్‌స్టేషన్ సమీపంలోని గ్రాండ్ ఆర్యా త్రిస్టార్ హోటల్‌ను బొల్లి వీరరాఘవయ్య చౌదరి నిర్వహిస్తున్నారు. ఆయనతో ఓయో సంస్థ ప్రతినిధులు ఆ హోటల్‌లో రూములు తాము బుక్ చేస్తామని అందుకు ఒప్పందం ప్రకారం సొమ్ములను ఇస్తామంటూ 2024లో ఒప్పందం చేసుకున్నారు. హోటల్‌లో ఓయో వద్ద బుక్ చేసుకున్న కస్టమర్లకు గ్రాండ్ ఆర్యా హోటల్‌లో రూములను రాఘవయ్య చౌదరి ఇస్తున్నారు. అందుకు సంబంధించిన సొమ్ములను ఇవ్వడం లేదని ఓయో ప్రతినిధులైన రవితేజ (విశాఖపట్టణం), ఉమేష్ (హైదరాబాద్), పృథ్వి (విజయవాడ), నవీన్ (విశాఖపట్టణం), సుధాకర్ (విజయవాడ)లపై సోమవారం చీటింగ్ కేసు నమోదు చేశారు.



మృతి చెందిన రాజ్‌కుమార్ (ఫైల్)..మహిళ ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న మృతుని కుటుంబీకులు

అంకన్నగూడెంలో యువకుడి ఆత్మహత్య

మహిళతో వివాహేతర సంబంధం

యువకుడి మృతి విషయం తెలిసి పురుగుల మందు తాగిన మహిళ

జీలుగుమిల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : అంకన్నగూడెంలో వ్యక్తి పురుగుల మందు తాగి విజయవాడ ఆస్పత్రిలో వైద్యం పొందుతూ సోమవారం మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శ్రీరాముల రాజ్ కుమార్ (23) గ్రామంలో ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం తెలిసిన మహిళ బంధువులు, ఆమె భర్త అతడిని చంపుతామని పలు మార్లు బెదిరించారు. తనకు ప్రాణహాని ఉందని తనకు రక్షణ కల్పించాలని ఇటీ వల మార్చి 28న జీలుగుమిల్లి పోలీస్‌లకు రాజ్ కుమార్ ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై గ్రామపెద్దలు జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించేందుకు సిద్ధమయ్యారు. ఈలోపే రెండు రోజుల క్రితం రాజ్‌కుమార్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు.ఆస్పత్రి పాలయ్యాడు. పరిస్థితి విష మించడంతో వైద్యం పొందుతూ సోమవారం విజయవాడలో మృతి చెందాడు.ఈ విషయమై హెడ్ కానిస్టేబుల్ పి.రాధాకృష్ణ కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వ హించి బంధువులకు అప్పగించారు.

మృతుడి బంధువుల ఆందోళన

అంకన్నగూడెంలో మృతుడు రాజ్‌కుమార్ కుటుంబీకులు మహిళ ఇంటిపై దౌర్జన్యానికి దిగారు. రాజ్‌కుమార్ మృతికి మహిళ కుటుంబీకుల బెదిరింపులే కారణమని మండి పడ్డారు. సమస్య పోలీస్‌ల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేక పోయారని ఆందోళనకు దిగారు. మృత దేహంతో మహిళ ఇంటి వద్ద ఆందోళన చేశారు. ఇదిలా ఉంటే రాజ్‌కుమార్‌తో సంబంధం కలిగిన మహిళ సోమవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మ హత్యకు పాల్పడింది. ఆమెకు రాచన్నగూడెం పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం తరలించారు.

టీడీపీ నుంచి ఇద్దరి సస్పెన్షన్

కామవరపుకోట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అంకాలంపాడు పంచాయతీ జలపావారి గూడెంకు చెందిన కరుటూరి బాలస్వామి, మిధున్‌లు వైసీపీ నుంచి వచ్చి టీడీపీలో ఉంటున్నా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తెలిసిందని మండల తెలుగుదేశం అధ్యక్షులు కిలారు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ తెలిపారు. ఈ మేరకు వారిద్దరినీ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు తెలిపారు.

రమాకుమారికి సాహిత్య పురస్కారం

ఏలూరు రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణాపురంలో సాహిత్య మండలిలో ఉగాది పురస్కారోత్సవంలో భాగంగా నగరానికి చెందిన ప్రముఖ నేత్రావధాని కాశీభొట్ల రమాకుమారికి పుల్లాభొట్ల శ్రీరామ్‌మూర్తి సాహిత్య పురస్కారం అందజేశారు. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన వారికి ప్రతి ఏడాది పురస్కారాలు అందచేస్తున్నారు. ఈ ఏడాది నేత్రావధాని రమాకుమారికి పుల్లాభొట్ల శ్రీరామ్మూర్తి సాహిత్య పురస్కారం ప్రకటించి పురస్కారాన్ని, జ్ఞాపికను అందజేశారు.



పెరుగుగూడెం నుంచి కలశాలతో వస్తున్న పాటిమ్మ అమ్మవారి భక్తులు

పాటిమ్మ అమ్మవారి గ్రామోత్సవం

దెందులూరు,మార్చి 31 (ఆంధ్రజ్యోతి): చల్లచింతలపూడి - పెరుగుగూడెం గ్రామాల మధ్య వెలసిన పాటిమ్మ గ్రామోత్సవం నిర్వహించారు. పెరుగుగూడెంలోని పావులూరి దశరథరామయ్య ఇంటి నుంచి 108 కలశాలతో అమ్మవారిని పల్లకిలో ఉంచి 108 మంది ముత్తైదువులతో కలిసి దేవస్థానం చైర్మన్ యలమర్తి శ్రీను, మాజీ సర్పంచ్ హేమలత దంపతులు, గ్రామస్తులు గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి పంచామృతాలతో అభిషేకం చేశారు, ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు.

దుర్గమ్మకు ఎమ్మెల్యే బాలరాజు పూజలు



కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

బుట్టాయగూడెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రెడ్డిగణపవరంలో కనక దుర్గ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామిని సోమవారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవలే అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించిన ఆలయ ధర్మకర్త భూమరాజు సత్యనారాయణరాజు, కమిటీ చైర్మన్ అల్లూరి రత్నాజీరావులను అభినందించారు.

బాల వెంకటేశ్వరస్వామికి వెండి ఆభరణాలు



వెండి ఆభరణాలు అందిస్తున్న భక్తులు

నిడమర్రు మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బాల వెంకటేశ్వరస్వామికి గ్రామస్థులు సుమారు 15 లక్షల రూపాయల విలువైన వెండి ఆభరణాలను బహూకరించారు. ఇటీవల ఆలయ గర్భాలయం పునర్నిర్మాణ కార్యక్రమాల అనంతరం విగ్రహాల సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా గ్రామపెద్దలు, భక్తులు సుమారు 15 లక్షల రూపాయల విలువైన నూతన రజిత చంద్ర ప్రభాకిరీటం, వక్షస్థలం, శంకుచక్రాలు, అమ్మవార్లకు కిరీటాలు, సువర్ణ మాంగళ్య సూత్రాలు సమర్పించారు. ఆలయ ధర్మకర్త నాయుడు దొరబాబుకు గ్రామస్థులు వేగిరెడ్డి యుగంధర్ దుర్గావిజయలక్ష్మి దంపతులు, పేరిచర్ల కృష్ణమూర్తి సత్యవతి దంపతులు, నౌడు వంశీమురళీ శ్యామల దంపతులు మంతినీడి లక్ష్మీనాథ్ ఈశ్వరీ దంపతులు తదితరులు పాల్గొని సమర్పించారు. ఆలయ అర్చకులు వాడపల్లి సత్య శ్రీనివాస్ సంప్రోక్షణ చేసి పూజాకార్యక్రమాలు నిర్వహించి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న మన్నవ కృష్ణచైతన్య

బుట్టాయగూడెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను అమలు పరచడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కారం దారయ్య అన్నారు. సీపీఐ 100 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా దేశంలో జరుగుతున్న మత రాజకీయాలు, సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఈ నెల 23న ఏలూరులో ప్రారంభమైన జీపు జాత ద్వారాకతిరుమల, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం, కొయ్యలగూడెం, టి.నర్సాపురం, చింతలపూడి మండలాల్లో పర్యటించి సోమవారం బుట్టాయగూడెం మండలంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటరులో జరిగిన కార్యక్రమంలో కృష్ణచైతన్య ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

కార్యదర్శి వర్సెస్ టీడీపీ వార్డు మెంబర్లు

ఉంగుటూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కుపల్లిగోకవరం గ్రామంలోని పంచాయితీ పాలకవర్గంలో కార్యదర్శి కుసుమ టి.డి.పి. నాయకుల మధ్య విభేదాలు తలెత్తాయి. టి.డి.పి.నేతలు తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని సచివాలయ సిబ్బందితో కలిసి స్థానిక ఎంపీడీవో రాజ్ మనోజ్‌కు కార్యదర్శుల సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. దీనికి ప్రతిఫలంగా అధికారులపై టి.డి.పి.నాయకులు జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై వార్డు సభ్యుడు తమ్మినేడి సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో బిల్లుల విషయంలో జరిగిన అవకతవకల విషయమై కార్యదర్శిని ప్రశ్నించడం జరిగిందని తెలిపారు. కొద్దిరోజుల క్రితం తాగునీటి సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం వహించడంతో నిలదీయడం జరిగిందన్నారు. ఇదిలా ఉండగా పలు పార్టీల నాయకులు తమ ఇష్టం వచ్చినట్లు ప్రవరిస్తున్నారని కార్యదర్శి కుసుమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

పోలవరం, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పోలవరం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో నేత్ర, దంత, జనరల్, ఎముకల వైద్య సేవలు అందించారు. 30 మందికి ఉచితంగా కళ్ళజోళ్లు పంపిణీ చేశారు.

చికెన్ వ్యర్థాలతో వాహనం పట్టివేత



పెదపాడు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసే ందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా వసంతవాడ-తోటగూడెం గ్రా మాల మధ్య తనిఖీలు నిర్వహించి చికెన్ వ్యర్థాలతో వెళుతున్న ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్‌ఐ కట్టా శారద సతీశ్ తెలిపారు. వాహన యజమాని, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

రేపు శ్రీచైతన్య విద్యార్థుల స్పోర్ట్స్ మీట్

ఏలూరు రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విద్యానగర్ శ్రీ చైతన్య పాఠశాలలో ఏప్రిల్ 2వ తేదీన డాక్టర్ బి.ఎస్.రావు మెమోరియల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. స్పోర్ట్స్ మీట్‌లో 11 బ్రాంచ్‌ల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.





భీమడోలులో ముస్లింల నమాజ్.. ఏలూరులో నమాజ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే బడేటి చంటి.. పోలవరంలో ప్రసంగిస్తున్న ముస్లిం మత పెద్ద

ఈద్ ముబారక్

ముగిసిన ఉపవాస దీక్షలు.. మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు

పోలవరం/కామవరపుకోట/పెదవేగి/ద్వారకాతిరుమల/జంగారెడ్డిగూడెం/భీమడోలు/చింతలపూడి/నిడమర్రు/ఏలూరు రూరల్/కుక్కునూరు/లింగపాలెం// మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలంలో రంజాన్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈద్గా స్థలంలో భారీ సంఖ్యలో ముస్లింలు ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించారు. అనంతరం భారీ ర్యాలీగా స్థానిక ఖబర్‌స్థాన్‌కి వెళ్లి సమాధుల వద్ద పూలు చల్లి అమరులైన తమ పెద్దలకు నివాళులర్పించారు. మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండి యాసీన్ షరీఫ్ ప్రసంగించారు. రంజాన్ సందర్భంగా ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. కామవరపుకోట, ఆడమిల్లి, తడికలపూడి, కళ్ళచెరువు, జీలకర్రగూడెం, రావికంపాడు, తూర్పుయడవల్లి తదితర గ్రామాల్లో రంజాన్ ప్రార్థనలతో సందడి నెలకొంది. పెదవేగి మండలం లక్ష్మీపురంలోని మసీదులో ముస్లింలు సోమవారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మతగురువు సుభానీ ప్రసంగించారు. ద్వారకాతిరుమల మండలంలోని తిరుమలంపాలెం, తిమ్మాపురం, ఈద్గాల వద్ద రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు, మహిళలు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. చింతలపూడి జామియా మసీదులో ముస్లింలు ప్రార్థనలు జరిపారు. పలువురు వీరికి శుభాకాంక్షలు తెలిపారు. నిడమర్రు మండలం క్రొవ్విడిలోని చినమసీదులో మతపెద్ద ఇమామ్ మహ్మద్ అబ్దుల్ వహీద్ ఆధ్వరంలో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మహ్మద్ ప్రవక్తను కీర్తిస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఏలూరులో పలుచోట్ల ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే బడేటి చంటి స్థానికంగా ముస్లింలతో కలిసి నమాజ్‌లో పాల్గొన్నారు. కుక్కునూరు మండలంలో భక్తిశ్రద్ధలతో రంజాన్ జరుపుకున్నారు. లింగపాలెంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

- రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీక అని ఉమ్మడి జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ షేక్ ముస్తఫా, బిలాల్ మసీదు అధ్యక్షుడు షేక్ యాకూబ్ అన్నారు. రంజాన్ పండుగను సోమవారం జంగారెడ్డిగూడెం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బైనేరు వాగు సమీపంలో ఉన్న ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భీమడోలు, గుండుగొలను, పోలసానపల్లి, అంబరపేట తదితర గ్రామాల్లో రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సంతమార్కెట్‌లో ఉన్న మసీదులో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వక్ఫ్‌బోర్డు పై కేంద్రం పెట్టిన సవరణలను నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.



అప్పనవీడులో ముస్లింలకు మటన్, పాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

ముస్లింల సొంతింటి కల నేరవేరుస్తా

ఎమ్మెల్యే చింతమనేని

పెదపాడు/పెదవేగి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : అర్హత ఉన్న పేద ముస్లింలకు ఉచితంగా ఇంటిస్థలం మంజూరు చేయడంతో పాటుగా నిర్మాణానికి తన వంతు అండగా నిలుస్తానని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని అప్పనవీడు, వట్లూరు గ్రామాల్లోని ముస్లిం కుటుంబాలకు మటన్, పాలను కుమార్తె నవ్యశ్రీ, కూటమి నాయకులతో కలిసి సోమవారం అందజేశారు. నియోజకవర్గంలోని ముస్లిం కుటుంబా లకు 1.8 టన్నుల మటన్, పాలు అందించారు. కార్య క్రమంలో గారపాటి రామసీత, ఉప్పలపాటి రాంప్ర సాద్, గుత్తా అనిల్, వేమూరి శ్రీనివాసరావు, లావేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు. పెదవేగి మండంలో పలు ప్రాంతాల్లో జరిగిన ప్రార్థనల్లో ఎమ్మెల్యే చింతమనేని పాల్గొన్నారు. మటన్, పాలు పంపిణీ చేశారు.

ఇంటర్వ్యూ..

విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలి

కె.మీనాకుమారి, మండల వ్యవసాయాధికారిణి, చింతలపూడి



- **మండలంలో రబీ వరి దిగుబడి ఎలా ఉంది. ఎన్ని ఎకరాల్లో నాటారు ?**

జవాబు : 4,424 ఎకరాల్లో నాటారు. దిగుబడి బాగానే ఉంది. ఏప్రిల్ నెల 15వ తేదీ తరువాత కోతలకు వస్తాయి.

- **కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేస్తున్నారా ?**

జవాబు : ఇంకా సమయం ఉంది. రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రాలు సకాలంలోనే ఏర్పాటు చేస్తాం.

- **రైతుల విశిష్ట సంఖ్య ఎంత మేరకు నమోదైంది ?**

జవాబు : ఇప్పటివరకు మండలంలో 12 వేల మంది నమోదు చేసుకోగా, ఇంకా వెయ్యి మంది నమోదు కావాల్సి ఉంది.

- **సబ్సిడీ పరికరాలు ఏమి ఇస్తున్నారు ?**

జవాబు : ప్రస్తుతం 50 శాతం సబ్సిడీపై తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ పరికరాలు అందిస్తున్నాం.

- **పచ్చిరొట్ట విత్తనాలు ఖరీఫ్ పంటకు సిద్ధంగా ఉన్నాయా ?**

జవాబు : ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌తో వాటిని సిద్ధం చేస్తాం. వీటితోపాటు ప్రకృతి సేద్యం చేసే వారికి నవ ధాన్యాలు కూడా ఈ ఏడాది సరఫరా చేస్తాం.

- చింతలపూడి, ఆంధ్రజ్యోతి



జంగారెడ్డిగూడెంలో క్రైస్తవుల ర్యాలీ

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ చేయాలని ప్రదర్శన

జంగారెడ్డిగూడెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టి తగిన న్యాయం చేయాలని మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్.స్టీఫెన్ విజ్ఞప్తి చేశారు. సోమవారం పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేసి ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఐఖ్య క్రైస్తవ సమాఖ్య ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం పట్టణంలో వెయ్యి మంది క్రైస్తవులతో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. బోసుబొమ్మ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.

ఉపాధి కూలీల వేతన బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా జిల్లా కార్యదర్శి రామకృష్ణ

జీలుగుమిల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వంకవారి గూడెంలో సోమవారం కూలీలతో వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. మూడు నెలల నుంచి ఉపాధి కూలీలకు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పని ప్రదేశంలో పనిముట్లు ఇవ్వాలని, మంచినీరు, టెంట్, మజ్జిగ వంటి సౌకర్యాలు ఏర్పాటు చెయ్యాలన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎ.రవి, టి.ముత్యాలమ్మ, వై.నాగేంద్రరావు, ఎం.సుదారాణి, కారం దుర్గ పాల్గొన్నారు.

మంచినీటి బోరు ఏర్పాటు



జీలుగుమిల్లి, మార్చి 31, (ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లిలో కొద్ది రోజులుగా తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ మోటారు పాడైంది. ఈ క్రమంలో సోమవారం తాగునీటి సమస్య పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎంపీడీవో టి.నిఖిల్ మధుసూధన్ చొరవతో పంచాయతీ బోరు వద్ద కొత్త మోటారు ఏర్పాటు చేశారు.

2న కలెక్టరేట్ వద్ద 'ఫ్యాప్టో' నిరసన

ఏలూరు అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా 12లక్షలమంది ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు 11వ పీఆర్సీ, డీఏ, సరెండర్ లీవులు, సీపీఎస్ ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.23వేల కోట్ల నిధులను విడుదలచేయాలని సోమవారం ఏలూరులో సమావేశమైన ఏపీ ఉపాధ్యాయసంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) జిల్లాసమావేశంలో సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం తక్షణమే రోడ్‌మ్యాప్‌ను ప్రకటించాలన్నారు. ఫ్యాప్టో జిల్లాచైర్మన్ మోహన్‌రావు మాట్లాడుతూ 2024 జనవరి నుంచి ఇప్పటివరకు మూడువిడతల డీఏలు పెండింగ్‌లోఉన్నాయని, సీపీఎస్, జీపీఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలుచేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలుచేయడానికి ఇంతవరకు కార్యాచరణను కూడా ప్రకటించకపోవడం విచారకరమన్నారు. తక్షణమే 12వ పీఆర్సీ కమిషనర్‌ను నియమించాలని, కమిషన్ నివేదిక అందేలోగా 30శాతం మధ్యంతరభృతి(ఐఆర్)ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఆందోళనను పురస్కరించుకుని ఏప్రిల్ 2న మధ్యాహ్నం 3గంటలకు ఏలూరు కలెక్టరేట్‌వద్ద నిరసన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.



హేలాపురి ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ కార్యవర్గం

ఏలూరు రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : హేలాపురి ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గ సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా మాచర్ల శంకరరావు, అధ్యక్షునిగా లింగమల్లు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడుగా ఉప్పు సత్యనారాయణ, నెమలి కృష్ణ, జె.నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఉమా విజయసాయి, ప్రధాన కార్యదర్శిగా బత్తిన శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా కె.సహదేవుడు, వి.జనార్ధన, కోశాధికారిగా తరుణ్ సాయికుమార్ ఎన్నికయ్యారు.

బిషప్ జయరావుకు గురు పట్టాభిషేకం



కేక్ కట్ చేస్తున్న బిషప్ జయరావు

ఏలూరు రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్వేవియర్ నగర్‌లోని పీఠాధిపతి పొలిమేర జయరావు 33వ గురు పట్టాభిషేకం నిర్మల్‌గిరి పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ జాన్‌పీటర్, నిర్మలగిరి పుణ్యక్షేత్ర అన్నదాన ట్రస్టు చైర్మన్ కళ్ళె నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బిషప్ హౌస్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ పొలిమేర జయరావు మాట్లాడుతూ ప్రతి గురువు ప్రజల కోసం జీవించాలని, క్రీస్తు వలే పేదలపై ప్రత్యేక ప్రేమ కలిగి ఉండాలన్నారు. ఫాదర్ మైఖేల్ మాట్లాడుతూ బిషప్ జయరావు సేవలను కొనియాడారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కళ్ళె లలిత ట్రస్టు ద్వారా భక్తుల సౌకర్యార్థం ఏసీ, రెండు వాటర్ కూలింగ్ ఫ్రిజ్‌లు అందజేశారు. జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఘంటా ప్రసాదరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

అన్నదానం



భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వ్యాపార వేత్త దివంగత మామిళ్ళపల్లి గంగరాజు 25వ వర్ధంతి సందర్భంగా పాతబస్టాండ్ సెంటర్‌లో మర్రి అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చంటి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించి భక్తులకు స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో మామిళ్ళపల్లి పార్థసారథి, చోడే వెంకటరత్నం, నెరుసు వెంకట సుబ్బయ్య యాదవ్, ఎం.నందగోపాల్, ఎ.తిరుపతి, టి.రాజేష్ పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ



పండ్లు అందిస్తున్న వాకర్స్ సభ్యులు

ఏలూరు రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సత్రంపాడు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామకృష్ణాపురంలోని సత్యసాయిబాబా వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎస్.ప్రసాద్, ఎ.వి.పి.ఆంజనేయులు, లంకా కోటేశ్వరరావు, వాకర్స్ జిల్లా క్యాబినెట్ సెక్రటరి వి.ఆదినారాయణ, కె.చంద్రశేఖర్, కె.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



అలంకరణలో రేవులింగేశ్వరస్వామి

శివాలయాల్లో అభిషేకాలు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : విశ్వావసు నామ సంవత్సరంలోని తొలి సోమవారం కావడంతో శివాలయాల వద్ద భక్తులు అభిషేకాలు, రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. శివనామ స్తోత్రాలను పఠించారు. భక్తులకు వారి గోత్రనామాలతో అర్చనలు జరిపారు. శివ పురాణాలు పఠించారు. ఈ మేరకు దక్షిణపువీధిలోని మార్కండేయస్వామి, జలాపహరేశ్వరస్వామి, అగ్రహారంలోని నగరేశ్వరస్వామి, పాత శివాలయం, పవరుపేటలోని కాశీ విశ్వేశ్వరాలయం, పత్తేబాదలోని చౌడేశ్వరి రామలింగేశ్వరాలయం, శివనగర్‌లోని మల్లికార్జునస్వామి ఆలయం, భావిశెట్టివారిపేటలోని శివాలయం, సత్యనారాయణపేటలోని రేవులింగేశ్వరస్వామి ఆలయాల వద్ద భక్తులు శివపూజలతో, శివ పురాణాల పఠనంతో ఆరాధించారు. పలువురు భక్తులు నవగ్రహాల మందిరాల వద్ద దోష నివారణ అభిషేకాలు, తైలాభిషేకాలు నిర్వహించారు.

వేర్వేరు ప్రాంతాల్లో కోడిపందేలపై దాడులు

15 మంది అరెస్టు

భీమడోలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు మండలం లక్ష్మీపురం శివారు ప్రాంతాల్లో కోడిపందేలు ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు భీమడోలు పోలీసులు దాడులు నిర్వహించారు. భీమడోలు ఎస్‌ఐ సుధాకర్‌తో పాటు సిబ్బంది నిర్వహించిన ఈ దాడిలో ఐదుగురు జూదగాళ్లు, ఒక కోడి, ఒక కత్తి, 17 వేల 20 రూపాయల సొమ్మును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కామవరపుకోట: తడికలపూడి పోలీసులు ఆడమిల్లి, వీరిశెట్టిగూడెం గ్రామాల్లో కోడి పందేలపై దాడులు జరిపి పది మంది వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి ఆరు కోడి పుంజులు, 13 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తడికలపూడి ఎస్‌ఐ పి.చెన్నారావు తెలిపారు. ఆడమిల్లి గ్రామంలో ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి మూడు కోడి పుంజులు, 8,500 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిశెట్టిగూడెం గ్రామంలో ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి మూడు కోడి పుంజులను స్వాధీనం చేసుకుని 4,500 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. మండలంలో ఏ గ్రామంలోనైనా పేకాట, జూదాలు, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు. గ్రామాల్లో ఇటువంటి సంఘటనలు జరుగుతుంటే పౌరులు తమవంతు బాధ్యతగా సమాచారాన్ని అందించాలని ప్రజలకు ఎస్‌ఐ విజ్ఞప్తి చేశారు.

ఆదమరిస్తే అంతే..

అడుగుకో గొయ్యి ఉన్న ఫుట్‌పాత్



అస్తవ్యస్తంగా ఉన్న ఫుట్‌పాత్ రహదారి

నగరంలోని కొత్తబస్టాండ్ నుంచి సత్రంపాడు వెళ్ళే ప్రధాన మార్గంలో మురుగు కాలువపై సత్రంపాడు సెంటర్‌లో వంతెనకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను గతంలో నిర్మించారు. అయితే రోడ్డుపై రాకపోకలు సాగిస్తే ప్రమాదాలు జరుగుతాయని ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేసినప్పటికి వాటిని పట్టించుకోకపోవడంతో తరచూ ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. అడుగుకో గొయ్యి ఉండడంతో ఎలా రాకపోకలు సాగించాలంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఫుట్‌పాత్‌లకు కూడా మరమ్మతులు చేయకపోతే ఎలా అంటూ ప్రశ్నిస్తున్నారు. సత్రంపాడు సెంటర్‌లో గల ఈ వంతెన వద్ద రేయింబవళ్ళు రద్దీ ఉంటుంది. అనేక వాహనాలు వందలకొద్ది రాకపోకలు సాగిస్తుంటాయి. రద్దీ ప్రాంతం కావడంతో రాకపోకలు సాగించేందుకు ఫుట్‌పాత్‌లు అనువుగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

- ఏలూరు కార్పొరేషన్

నేడు భూముల రీసర్వేపై గ్రామసభ

ముదినేపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పైలట్ ప్రాజెక్టుగా రీసర్వే నిర్వహించిన చిన కామనపూడిలో మంగళవారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుభానీ తెలిపారు. సుమారు 600 ఎకరాల విస్తీర్ణంలోని భూములకు నిర్ణయించిన హద్దులను రైతులకు తెలిపి వారి అభిప్రాయాలను తీసుకుంటామన్నారు. భూములు కలిగి ఉన్న రైతులందరూ గ్రామసభకు హాజరు కావాలని తహసీల్దార్ కోరారు.

తైవాన్‌లో తెలుగు సంబరాలు

టీటీఏ ఆధ్వర్యంలో ఉగాది



బహుమతి అందుకుంటున్న నాగ విజయ

ముసునూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తైవాన్ తెలుగు అసోసియేషన్ (టీటీఏ) ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను నేషనల్ యాన్మింగ్ చ్యావోటంగ్ విశ్వవిద్యాలయం, హ్సించుతైవాన్‌లో ఘనంగా నిర్వహించారు. కల్చరల్ కమిటీ హెడ్, ముసునూరు మండలం కాట్రేనిపాడుకు చెందిన గోగినేని నాగ విజయ కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇండియా తైపీ అసోసియేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ కంఠం మహేష్ కుమార్ తైవాన్-భారత సమాజాల మధ్య సాంస్కృతిక ఐక్యతను ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. నాగ విజయకు మహేష్ కుమార్ ప్రత్యేక బహుమతి అందజేశారు. టీటీఏ అధ్యక్షుడు మనోజ్ శ్రీరామోజు, ఉపాధ్యక్షులు కొరిటాల శివ, వందవాసి రామకృష్ణ కిశోర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రామకృష్ణ సేవా సమితిలో సాంస్కృతిక కార్యక్రమాలు



అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న జ్యోతిర్మయి

కైకలూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉగాది మహోత్సవం ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందించేందుకు దోహదపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరు రామకృష్ణ సేవాసమితిలో సోమవారం సంగీత విభావరి, సాంస్కృతి కార్యక్రమాలను నిర్వహించారు. కొండవీటి జ్యోతిర్మయి సంగీత విభావరిలో రామ సంకీర్తన, అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. సంగీత విభావరితో పాటు పసుమర్తి శ్రీవల్లీ బృందం భరతనాట్యం విశేషంగా ఆకట్టుకుంది. అన్నమయ్య కీర్తనలు ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ ఉగాది పండుగ విశిష్టతను తెలియజేస్తూ చేపట్టే కార్యక్రమాలు అభినందనీయమని, నేటి భావితరాల పిల్లలకు అన్నమయ్య కీర్తనలు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోట దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ



గురజలో ప్రతిష్ఠించిన కోట దుర్గమ్మ విగ్రహం

ముదినేపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గురజ గ్రామంలోని అల్లూరి సీతారామరాజు కాలనీలో సోమవారం కోట దుర్గమ్మ, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాల ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. సుసర్ల సత్యనారాయణమూర్తి, శ్రీనివాస శర్మ హోమాలు, పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకుడు చేడిక వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. వందలాది మంది భక్తులు కోట దుర్గమ్మ అమ్మవారికి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి సాంప్రదాయ సిద్ధంగా పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. కొండ దొరల ఇలవేల్పు అయిన కోట దుర్గమ్మకు కాలనీ వాసులు పూజలు చేశారు.

రహదారులకు మహర్దశ



సి-కేటగిరి కింద మరమ్మతులు, అభివృద్ధికి రూ.42.22 కోట్లు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 24 రోడ్లకు మోక్షం

ఏలూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ జమానాలో నానాటికీ తీసికట్టుగా మారిన రోడ్లు, భవనాలశాఖ పరిధిలోని రహదారులకు ఇప్పుడు మహర్దశ పట్టనుంది. తొలి విడత గుంతల్లేని రహదారులుగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పలు పనులను సర్కార్ పూర్తిచేసింది. సంక్రాంతి నాటికే దాదాపు పూర్తి చేశారు. గతంలో దారుణాతిదారుణంగా గుంతలు తేలిన రోడ్లను పూడ్చడానికి వీల్లేని వాటిని సీ-కేటగిరి కింద తీసుకుని ఆయా రీచ్‌ల వద్ద పూర్తి మర మ్మతులు, అభివృద్ధి చేయడానికి గత నవంబర్‌లో 2 జిల్లాల అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి పంపారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా 24 రోడ్లకు రూ.42 కోట్ల 22 లక్షలతో పరిపాలనా ఆమోదం ఇచ్చింది. ఇప్పుడు ఆ రోడ్లను పూర్తి చేయడానికి వేగంగా అడుగులు వేయనున్నారు.

ఏయే రోడ్లు బాగు చేస్తారంటే..

పలు నియోజకవర్గాల్లో రోడ్లపైన రాకపోకలు సాగించే ప్రజలు, ద్విచక్ర వాహనదారులు ప్రత్యక్ష నరకం చవి చూశారు. వారి బాధలకు మోక్షం కల్పిస్తూ ఈ రోడ్లను పూర్తిగా అభివృద్ధి చేస్తారు. ఇందులో దెందులూరు నియోజకవర్గంలోని ఏలూరు రూరల్ మండలం కొల్లేరు పరిధిలో కోటేశ్వరదుర్గాపురం నుంచి పైడి చింతపాడు వయా కొక్కిరాయలంక వరకు దాదాపుగా 6.9 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధికి రూ.2 కోట్ల 5 లక్షలతో గ్రావెల్ రోడ్డుస్థానంలో బీటీ వేయనున్నారు. ఇది వరదలు, వర్షాలతో పూర్తి సర్వనాశనమైంది. అదేవిధంగా ఈజే రోడ్డు నుంచి డీపీ రోడ్డు వయా ముండూరు నుంచి మేదినరావు పాలెం 3.80 కిలోమీటర్ల నిడివి కలిగిన రోడ్డుకు రూ.కోటి 50 లక్షలు కైకలూరు నియోజకవర్గంలో ఉప్పరగూడెం నుంచి విశ్వనాద్రిపాలెం వరకు 2.55 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి రూ. కోటి 20 లక్షలు, స్పెషల్ రిపేర్లు కింద వెస్ట్ విప్పర్రు నుంచి గుణపర్రు వరకు 4.94 కిలోమీటర్లకు రూ.కోటి 50 లక్షలు, పశ్చిమ గోదావరి జిల్లాలోని ఉండి నియోజకవర్గంలో వాండ్రం నుంచి సీసలి 2 కిలోమీటర్ల రోడ్డుకు 2 కోట్ల 65 లక్షలు, తణుకు నియోజకవర్గంలోని ఉరదాళ్లపాలెం నుంచి దువ్వ వరకు 8.80 కిలోమీటర్ల రోడ్డుకు 3 కోట్ల 50 లక్షలు మంజూరు చేశారు.

రాష్ట్ర హైవే - రోడ్ల అనుసంధానం

ఉమ్మడి జిల్లాలో 11 ప్రధాన రహదారులుండేవి. ఒక మండలం నుంచి మరో మండలం అనుసంధానంతో పాటు రాష్ట్ర హైవేకు కలిపే రోడ్లు కూడా జిల్లాలో దారుణంగా తయారయ్యాయి. పూర్తిగా దెబ్బతిన్న రోడ్లపై లేయర్లను వేసి ఇతర రోడ్లకు సమాంతరంగా వీటిని తీర్చిదిద్దనున్నారు. రెండు జిల్లాల పరిధిలో చింతలపూడి నియోజకవర్గంలో నరసాపురం నుంచి అశ్వారావుపేట 0.99 కిలోమీటర్లకు రూ.80 లక్షలు, చేబ్రోలు- దేవులపల్లి రోడ్డు 2.17 కిమీకు 70 లక్షలు, చింతలపూడి- రావికంపాడు 4 కిలో మీటర్ల రోడ్డుకు రూ.2 కోట్లు పోలవరం నియోజకవర్గంలో యర్నగూడెం నుంచి పొంగుటూరు వరకు 1.20 కిమీకు రూ.40 లక్షలు, పోలవరం నుంచి కొయ్యలగూడెం 7.60 కిమీకి రూ.3 కోట్ల 40 లక్షలు, చింతలపూడి - రావికంపాడు రోడ్డు 10 కిలోమీటర్లకు 4 కోట్ల 22 లక్షలు, ఏలూరు నియోజకవర్గంలో ఏలూరు నుంచి కైకలూరు వెళ్లే రోడ్డు 2 కిలోమీటర్లకు కోటి రూపాయలు, ఏలూరు నగరంలోని సీసీ రోడ్డు నూజివీడు- నుంచి ఏలూరు రోడ్డు 45 మీటర్లకు 90 లక్షలు, కైకలూరులో వడాలి నుంచి తాడినాడ రోడ్డు 5 కిలోమీటర్లకు 2 కోట్లు, దెందులూరు నియోజకవర్గంలో నూజివీడు-ఏలూరు రోడ్డు 1.20 కిలో మీటరు నిడివి గల రోడ్డు రూ.60 లక్షలు, నూజివీడు నియోజకవర్గంలోని నూజివీడు- గన్నవరం రోడ్డు ఇంప్రూవ్‌మెంట్‌కు 5.40 కిలోమీటర్లకు 2 కోట్ల 50 లక్షలు, అడవి నెక్కలం నుంచి వెలవాదం రోడ్డు 9 కిలోమీటర్లకు 3 కోట్లు, ఉంగుటూరులో భీమడోలు-కామవరపుకోట పాతరోడ్డు ఇంప్రూవ్‌మెంట్ 1.8 కిమీకు 2 కోట్లు మంజూరు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలోని తణుకులో మార్టేరు-ప్రక్కిలంక 5.90 కిమీకు రూ.3 కోట్లు, పాలకొల్లులో పాలకొల్లు నుంచి దొడ్డిపట్ల రోడ్డు 11.60 కిమీ మేర రూ.5 కోట్లతో, ఆచంట నియోజకవర్గంలో పాలకొల్లు- ఆచంట రోడ్డు 1.50 కిమీలకు కోటి 50 లక్షలతో పనులు చేసేందుకు పరిపాలనామోదం ఇచ్చారు.

అంకన్నగూడెంలో యువకుడి ఆత్మహత్య

మహిళతో వివాహేతర సంబంధం

యువకుడి మృతి విషయం తెలిసి పురుగుల మందు తాగిన మహిళ

జీలుగుమిల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అంకన్నగూడెంలో వ్యక్తి పురుగుల మందు తాగి విజయవాడ ఆస్పత్రిలో వైద్యం పొందుతూ సోమవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన శ్రీరాముల రాజ్ కుమార్ (23) గ్రామంలో ఒక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దీనితో ఆమె భర్త, బంధువులు అతడిని చంపుతామని పలు మార్లు బెదిరించారు. తనకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని మార్చి 28న జీలుగుమిల్లి పోలీస్‌లకు రాజ్ కుమార్ ఫిర్యాదు చేశాడు. గ్రామపెద్దలు జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించేందుకు సిద్ధమయ్యారు. ఈలోపే రెండు రోజుల క్రితం రాజ్‌కుమార్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. పరిస్థితి విషమించడంతో వైద్యం పొందుతూ సోమవారం విజయవాడలో మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ పి.రాధాకృష్ణ కేసు నమోదు చేశారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

మృతుడి బంధువుల ఆందోళన

రాజ్‌కుమార్ మృతికి మహిళ కుటుంబీకుల బెదిరింపులే కారణమని బంధువులు మండిపడ్డారు. మృతదేహంతో మహిళ ఇంటి వద్ద ఆందోళన చేశారు. పోలీసులకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఇదిలా ఉంటే రాజ్‌కుమార్‌తో సంబంధం కలిగిన మహిళ సోమవారం సాయంత్రం పురుగుల మందు తాగింది. రాచన్నగూడెం పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం తరలించారు.



కైకలూరులో రంజాన్ ప్రార్థనలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్



ముసునూరు మండలం చెక్కపల్లిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



నూజివీడులో రంజాన్ వేడుకల్లో ముస్లింలతో మంత్రి పార్థసారథి

రంజాన్ వేడుక

శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కొలుసు, ఎమ్మెల్యే శ్రీనివాస్



నూజివీడులో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, ముదినేపల్లిలో ఈద్ ముబారక్

నూజివీడు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని నూజివీడు ఈద్గాలో సోమవారం ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. నూజివీడులోని ఈద్గా అభివృద్ధికి తన వంతు సహకారాలు అందిస్తానన్నారు. ఈద్గా స్థలానికి త్రీఫేజ్ కరెంటు ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, స్వయం ఉపాధి, ఉద్యోగ కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముస్లిం పెద్దలు సుభాని, జిలాని, షబ్బీర్, మునిసిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, జగదీష్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

● కైకలూరు: రంజాన్ పర్వదిన సందర్భంగా ముస్లింలు సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గాతో పాటు మసీదుల వద్ద ముస్లిం మత పెద్దలు అల్లా సందేశం వినిపించారు. కైకలూరు చిన్న, పెద్ద మసీదుల నుంచి ముస్లింలు ర్యాలీగా వెళ్లి ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింల ర్యాలీ, రంజాన్ ప్రార్థనల్లో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసం దాతృత్వానికి దానధర్మాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముస్లింలకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎ రహీం, ఎండీ జానీ, ఎండీ ఉస్మాన్, సయ్యద్ బాషీద్, ఎస్ జమీల్ అహ్మద్, ఎంపీపీ అడవి కృష్ణ, బీకేఎం నాని, పెన్మెత్స త్రినాథరాజు, పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, మంగినేని రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● నూజివీడు టౌన్: రంజాన్ ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ఈద్గాలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మత పెద్ద హఫీజ్ షేక్ తస్లీమ్ దువా సందేశాన్ని ఇవ్వగా పెద్ద మసీద్ బిలాల్ మసీద్ చిన్న మసీద్, కొత్వాల్ మసీద్, తదితర మసీదుల నుంచి ముస్లింలు వేలాదిగా ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఒకరికొకరు ఈద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

● ముసునూరు: ముస్లింలు నెల రోజుల ఉపవాస ప్రార్థనలు ముగించుకుని సోమవారం రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముసునూరు, చెక్కపల్లి, గుడిపాడు, గోపవరం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ పండుగ రోజు విరివిగా దానధర్మాలు చేయాలని మత పెద్దలు ఉద్బోధించారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతన మేలు కలయిక పవిత్ర రంజాన్ అన్నారు.

● ముదినేపల్లి: ముదినేపల్లి మసీదులో కమిటీ అధ్యక్షుడు షేక్ బాజీ ఆధ్వర్యంలో ముస్లింలు రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు. టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సంకర్షణపురంలో మజీద్ హుస్సేన్ ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలు నిర్వహించారు.

● చాట్రాయి: మండలంలో రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చనుబండ, నరసింహారావుపాలెం, కోటపాడు, పోలవరం, సోమవరం, తుమ్మగూడెం తదితర గ్రామాలలో మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అల్లా సందేశాలను మత పెద్దలు బోధించారు. ముస్లింలు పాయసం తయారుచేసి బంధుమిత్రులకు పంపిణీ చేశారు.

కాంట్రాక్ట్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పిస్తా

పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ భరోసా



ఎమ్మెల్యే కామినేనికి సమస్యలను వివరిస్తున్న పారిశుధ్య కార్మికులు

కైకలూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కైకలూరు పంచాయతీ కాంట్రాక్ట్ సిబ్బంది ఉద్యోగాలకు భద్రతకు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. స్థానిక ట్రావెలర్స్ బంగ్లాలో కైకలూరు పంచాయతీలోని 86 మంది పారిశుధ్య కార్మికులు, వాటర్‌వర్క్స్ సిబ్బంది, ఎలక్ట్రీషియన్స్ టెండర్ వివాదాన్ని సోమవారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉన్నతాధికారులతో చర్చించానని కాంట్రాక్ట్ సిబ్బంది ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పంచాయతీ అత్యవసర సమావేశం ఏర్పాటుచేసి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని హామి ఇచ్చారు.

అనంతరం పారిశుధ్య కార్మికులు విలేకర్లతో మాట్లాడుతూ తమ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లిన ఎమ్మెల్యే పీఏపై సర్పంచ్ డీఎం నవరత్నకుమారి బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని, పారిశుధ్య కార్మికుల పొట్టకొట్టేందుకు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేతలు పూల రామచంద్రరావు, బలే ఏసురాజు, కొల్లి వరప్రసాద్, వేల్పూరి చంద్రయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన ప్రభుత్వ లక్ష్యం

ముదినేపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పేదరికం నిర్మూలనకు ప్రభుత్వం నడుం బిగించిందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వడాలి, పెద కామనపూడి, చిన కామనపూడి, చిగురుకోట గ్రామాల్లో సుమారు రూ.1.3 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన సోమవారం ప్రారంభించారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, సర్పంచ్‌లు మరీదు దుర్గాశ్రీ, చిట్టూరి నాంచారయ్య, చొప్పర వెంకటరమణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, పైడిపాటి శివశంకర్, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, చలసాని జగన్మోహనరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ముదినేపల్లిలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. గ్రామీణ పేదలకు ప్రైవేట్ వైద్యులు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సూచించారు. డాక్టర్ పి.కళాసాగర్, డాక్టర్ పి.అనూష, ఎన్.పవన్, ఎల్.అమూల్య, ఎస్‌వి.చైతన్యకృష్ణ సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. రిటైర్డ్ మెడికల్ ఆఫీసర్ ఎం.సుందరయ్య, టీడీపీ నేతలు బొర్రా చలమయ్య, కొత్తూరు విఠల్, కోడూరు శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సమష్టిగా పనిచేయండి

మండవల్లి మార్చి 31(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి అందరూ సమష్టిగా పనిచేయాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కానుకొల్లు, అయ్యవారిరుద్రవరం, అప్పాపురం గ్రామాల్లో జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో సోమవారం ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో సజ్జా బాబి, సాగునీటి సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు, ముళ్లపూడి సత్తిబాబు, కానుకొల్లు, అప్పాపురం, అయ్యవారిరుద్రవరం సర్పంచ్‌లు మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.



దరుణ్ మృతదేహం

రైల్వే గేట్‌మెన్ గుండెపోటుతో మృతి

కైకలూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న రైల్వే గేట్‌మెన్ గుండెపోటుతో మృతి చెందిన సంఘటన కైకలూరులో చోటుచేసుకుంది. కైకలూరు రైల్వేస్టేషన్ సమీపంలోని 82వ రైల్వే గేటు వద్ద ఒడిశా రాష్ట్రానికి చెందిన బి.దరుణ్(51) ఆదివారం రాత్రి విధులు నిర్వహిస్తున్నాడు. అర్ధరాత్రి 1.30 సమయంలో గూడ్స్ రైలు వస్తుందని గేటు మూసేందుకు రైల్వేస్టేషన్ మాస్టర్ గేట్‌మెన్‌కు ఫోన్ చేశాడు. ఎంతకీ ఫోన్ ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి స్టేషన్లో విధుల్లో ఉన్న మరొకరిని పంపించారు. అతడు వెళ్లి చూడగా దరుణ్ అపస్మారకస్థితిలో ఉండడం గుర్తించి హుటాహుటిన కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రైళ్ల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అతని స్థానంలో మరొక ఉద్యోగికి విధులు అప్పగించారు. మృతుడి కుమారుడు బి.బలరామ్ ఫిర్యాదుతో భీమవరం జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి భార్య ఒడిశాలో ఉండడంతో మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచారు.



నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు

ఎస్ఐ వీరభద్రరావు

ముదినేపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు ముదినేపల్లి ఎస్ఐ వీఎస్ వీరభద్రరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో వంద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైన, సమస్యాత్మక ప్రాంతాల్లో మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా నాయకుల విగ్రహాలు, దేవస్థానాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో పోలీస్ గస్తీ ముమ్మరం చేశామన్నారు. బంటుమిల్లి, గురజ, కైకలూరు రోడ్డు సెంటర్లలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు రుణ లబ్ధిదారుల ఎంపిక ఇంటర్వ్యూలు

కైకలూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదల చేసిన కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 2 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎండీడీవో ఆర్.ఫణీంద్ర తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని దరఖాస్తుదారులు వారి దరఖాస్తు, ఆధార్, ఇతర వివరాలతో హాజరుకావాలని కోరారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	162, 171, 182
చికెన్ విత్ స్కిన్	310
చికెన్ స్కిన్‌లెస్	320
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



కృష్ణా మిల్క్ యూనియన్ సహకారం అభినందనీయం



విలేకరులతో మాట్లాడుతున్న పాల సొసైటీల అధ్యక్షులు

ముదినేపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి కృష్ణా మిల్క్ యూనియన్ సహకారం అభినందనీయమని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల అధ్యక్షులు అన్నారు. వడాలి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం వద్ద ఈడే బాబూజీ, పెయ్యేరు, చిగురుకోట, తామరకొల్లు, పెరికేగూడెం, చేవూరు సంఘాల అధ్యక్షులు హనుమార పేర్నీడు, బొబ్బా వెంకటరత్నం, చలసాని వేణుగోపాల్, పిండి రాధాకృష్ణ సోమవారం విలేకరులతో మాట్లాడారు. 2024-25 సంవత్సరానికి మిల్క్ యూనియన్ మూడో విడత బోనస్ రూ.18కోట్లు ప్రకటించడం హర్షణీయమన్నారు. యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండి కొల్లి ఈశ్వరబాబు కృషిని అభినందించారు.

స్వాతంత్ర్య సమరయోధుడు రాజగోపాలరావుకు నివాళి



రాజగోపాలరావు చిత్రపటం వద్ద నివాళులర్పించిన నేతలు

నూజివీడు టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు చలసాని రాజగోపాలరావు వర్ధంతి వెంకటాద్రిపురంలో సోమవారం నిర్వహించారు. రాజగోపాలరావు స్మారక గ్రంథాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నిమ్మగడ్డ నరసింహ అరుణ పతాకం ఆవిష్కరించారు.

రాజగోపాలరావు చిత్రపటానికి వేములపల్లి శ్రీమన్నారాయణ, ఆలూరు పూర్ణచంద్రరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో నిర్బంధం ఎదుర్కొన్న రాజగోపాలరావు అనంతర కాలంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఉద్యమించారన్నారు. ప్రజా పోరాటాలను ఓర్చుకోలేని కొందరు ఆయనను కాల్చి చంపడం బాధాకరమన్నారు. చలసాని నరేంద్ర, గోళ్ళ నాగరాజు, చలసాని గోపాలకృష్ణ, చలసాని సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

2న కలెక్టరేట్‌వద్ద 'ఫ్యాప్టో' నిరసన

ఏలూరు అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 12లక్షలమంది ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు 11వ పీఆర్సీ, డీఏ, సరెండర్ లీవులు, సీపీఎస్ ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ. 23వేల కోట్ల నిధులను విడుదలచేయాలని సోమవారం ఏలూరులో సమావేశమైన ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) జిల్లా సమావేశంలో సంఘ నాయకులు డిమాండ్ చేశారు. బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం తక్షణమే రోడ్‌మ్యాప్‌ను ప్రకటించాలన్నారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మోహన్‌రావు మాట్లాడుతూ 2024 జనవరి నుంచి ఇప్పటివరకు మూడు విడతల డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, సీపీఎస్, జీపీఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్ విధానం అమలుచేస్తామన్న ఎన్నికల హామీపై ఇంతవరకు కార్యాచరణ కూడా ప్రకటించకపోవడం విచారకరమన్నారు. తక్షణమే 12వ పీఆర్సీ కమిషనర్‌ను నియమించాలని, కమిషన్ నివేదిక అందేలోగా 30శాతం మధ్యంతరభృతి(ఐఆర్)ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఆందోళనను పురస్కరించుకుని ఏప్రిల్ 2న మధ్యాహ్నం 3గంటలకు ఏలూరు కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.



టి.గుడిపాడులో ఎకో అనలైజర్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ రామచంద్రరావు

పాల సహకార సంఘంలో ఎకో అనలైజర్ ప్రారంభం

చాట్రాయి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.గుడిపాడు పాల సహకార సంఘంలో ఏర్పాటు చేసి ఎకో అనలైజర్‌ను సోమవారం కృష్ణామిల్క్ యూనియన్ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నాణ్యత లేని పాల వలన రైతు, పాల సంఘాలు, యూనియన్ నష్టపోతున్నాయని, దీనిని అధిగమించటానికి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఎకో అనలైజర్ ఏర్పాటు చేశామన్నారు. పాల నాణ్యతను కచ్చితంగా తెలుసుకోవడం ద్వారా రైతులు, వినియోగదారులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు బలుసు రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్ నరసింహారావు, వేతన కార్యదర్శి తాతయ్యబాబు రైతులు పాల్గొన్నారు.

లయన్స్ కృషితో కృత్రిమ కాలు

చాట్రాయి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మగూడెంకు చెందిన లింగంపల్లి వెంకటేశ్వరరావుకు లయన్ క్లబ్ సహకారంతో కృత్రిమ కాలు ఏర్పాటు చేశారు. షుగర్ బాధితుడైన వెంకటేశ్వరరావుకు ఆపరేషన్ చేసి మోకాలి వరకు తొలిగించారు. ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం గంపా వెంకట్రావు బాధితుడి సమస్యను లయన్స్ క్లబ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆదివారం విజయవాడలో లయన్స్ ఇంటర్నేషనల్ సేవా మహోత్సవంలో బాధితుడు వెంకటేశ్వరరావుకు కృత్రిమ కాలు అమర్చారు.